క్లుప్తంగా

రేపటి నుంచి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు



గురజాల: శ్రీ పాతపాటేశ్వరి అమ్మవారి 426వ తిరునాళ్లను పురస్కరించుకుని గురజాల రైతు సంఘం గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాల స్థాయి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు ఈనెల 16వ తేదీ నుంచి జరుగుతాయని రైతు సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ సీనియర్ విభాగం, జూనియర్స్ విభాగం, ఆరు పళ్ల జతల విభాగం, నాలుగు పళ్ల జతల విభాగాల్లో బహుమతులు ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9912429126, 9849280288 నెంబర్లను సంప్రదించాల్సిందిగా సూచించారు.

నేడు ఉచిత హోమియో వైద్యశిబిరం

పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా మందిరం ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు శ్రీ భగవాన్ శ్రీ సత్యసాయిబాబా సేవా సమితి కన్వీనర్ గర్నె నాగేశ్వరరావు తెలిపారు. పిడుగురాళ్ల పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలకు ఉచిత హోమియో వైద్యసేవలను ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ హోమియో వైద్యం శిబిరానికి ప్రముఖ వైద్యుడు రాధా హోమియో ఆన్‌లైన్ కన్సల్టెన్స్ హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ గుడివాడ హేష్మ మంజూష హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని తెలిపారు.

నేడు గుండె పరీక్షల వైద్యశిబిరం

పిడుగురాళ్ల: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న స్కాలర్స్ స్కూల్ ప్రాంగణంలో ఆదివారం ఉచిత గుండె పరీక్షల వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎస్టీయూ పల్నాడు అధ్యక్షుడు రామలింగారెడ్డి తెలిపారు. తాగేపల్లి మణిపాల్ హాస్పటల్, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం పిడుగురాళ్ల మండల శాఖ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య పరీక్షల శిబిరం నిర్వహించనున్నామన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం నిర్వహించనున్నట్లు ఉంటుందని తెలిపారు. ఈ వైద్య శిబిరానికి కార్డియాలజిస్టులు డాక్టర్ దగ్గు నరసింహారెడ్డి, డాక్టర్ శివకోటిలు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పిడుగురాళ్ల, మాచవరం, దాచేపల్లి మండలాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు ఉపయోగించుకోవాలన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్



నరసరావుపేటటౌన్: గంజాయి విక్రేతను పోలీసులు అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను శనివారం సీఐ ఎం.వి.చరణ్ వెల్లడించారు. అక్రమంగా గంజాయి కలిగిన కేసులో రెండు నెలల క్రితం ఐదుగురిని అరెస్ట్ చేయగా కేసులో నిందితుడు వరవకట్ట ప్రాంతానికి చెందిన షేక్ అష్రఫ్ పరారీలో ఉన్నాడన్నారు. అతని కోసం ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ఈ క్రమంలో మొదటి రైల్వే గేట్ అంధుల పాఠశాల వద్ద అష్రఫ్ 1350 గ్రాముల గంజాయి, చోరీ చేసిన ద్విచక్ర వాహనంతో పట్టుబడ్డాడన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడిన నిందితుడు ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. గంజాయి అమ్మటం వలన ఎక్కువ ఆదాయం వస్తుందని భావించి పట్టణానికి చెందిన షేక్ షరీఫ్, చావపాటి ఉమర్ సాధిక్‌లను కలుపుకొని వైజాగ్ నుంచి వారి సొంత కారులో రహస్యంగా గంజాయిను అక్రమంగా తీసుకొచ్చి విక్రయాలకు పాల్పడుతున్నట్లు తెలిసినట్లు చెప్పారు. నిందితుడి వద్ద నుంచి గంజాయితో పాటు రెండు బుల్లెట్లు, ఒక పల్సర్, మూడు స్కూటీ వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ద్విచక్ర వాహన చోరీలకు సంబంధించి యజమానులు ఇచ్చిన ఫిర్యాదుతో ఇప్పటికే వన్‌టౌన్, టూటౌన్, మంగళగిరి పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదై ఉన్నాయన్నారు. కేసులో ప్రతిభ కనపరిచిన ఎస్ఐ పి.వంశీకృష్ణ, సిబ్బంది వీరాంజనేయులు, రాజేష్, కోటేశ్వరరావులను డీఎస్పీ కె.నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించినట్లు సీఐ తెలిపారు.

ఆకట్టుకుంటున్న క్రిస్మస్ స్టార్లు



నకరికల్లు: గ్రామాల్లో క్రిస్మస్ సందడి ఆరంభమైంది. క్రైస్తవులు వీధులు, గృహాలపై రంగురంగుల భారీ క్రిస్మస్ స్టార్లు ఏర్పాటు చేస్తున్నారు. భారీగా ఖర్చులు ఏర్పాటు చేసి, విద్యుద్దీపాలతో స్టార్లు అలంకరిస్తున్నారు.

ఉద్యానంపై రైతుల ఆసక్తి

- పల్నాడులో పెరుగుతున్న ఉద్యాన పంటల సాగు
- విస్తారంగా పండ్లు, పూల తోటలు
- సంప్రదాయ పంటల సాగులో వస్తున్న నష్టాలతో విసిగిపోయిన రైతులు
- ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి



గురజాలలో బంతి పూల తోటను పరిశీలిస్తున్న అధికారులు

గురజాల: పల్నాడు ప్రాంతంలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ప్రతి ఏడాది ఒకే రకమైన పంటలు సాగు చేయడం వలన పెట్టుబడులు పెరుగుతున్నా.. దిగుబడులు ఆశించిన స్థాయిలో ఉండడం లేదు. దీంతో రైతులు పంటల సాగులో నష్టాలు చవిచూడాల్సి వస్తుంది. పల్నాడు ప్రాంతంలో అధికంగా వరి, పత్తి పంటలు సాగు చేస్తుంటారు. వర్షాభావ పరిస్థితులతో పెట్టిన పెట్టుబడులు సైతం రాక నష్టాల బారిన పడుతున్నారు. పంటలు సాగు చేసి కష్టపడుతున్న రైతులకు నిరాశే మిగులుతుంది. పంటల సాగులో పెట్టుబడులు పెరుగుతున్నాయే తప్ప ఆశించిన మేర దిగుబడులు మాత్రం రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. దీంతో కొందరు రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఉద్యాన పంటలైన పండ్లు, పూలు, కూరగాయల సాగు చేపడుతున్నారు.

పెరిగిన పండ్లు, కూరగాయల సాగు..

పల్నాడు ప్రాంతం గురజాల నియోజకవర్గంలోని మండలాల్లో ప్రతి ఏడాది పండ్లు, కూరగాయల సాగు పెరుగుతోంది. గురజాల నియోజకవర్గంలోని గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల్లోని పలు గ్రామాల్లో రైతులు ఉద్యాన పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 216.71 హెక్టార్లు (సుమారు 542 ఎకరాలు)లో పండ్లు, కూరగాయల సాగు చేపట్టారు. నియోజకవర్గంలో పూలు, పండ్ల సాగు 169.62 హెక్టార్లు, కూరగాయల సాగు 47.09 హెక్టార్లలో సాగు చేసినట్లు ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. ఉద్యాన పంటల సాగుతో మంచి ఆదాయం ఉంటుందనే ఉద్దేశంతోనే సాగుకు ఆసక్తి చూపుతున్నారని అంటున్నారు. వ్యవసాయ పంటల్లో ఆశించిన మేర ఆదాయం రావడం లేదు. అదే ఉద్యాన పంటల సాగులో ఆదాయం బాగుంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రైతులు అధికంగా పూల సాగుకు కూడా ఆసక్తి చూపుతున్నారు. పల్నాడు ప్రాంతంలో అధికంగా బంతి, చామంతి పూలతోటలు సాగు చేస్తున్నారు.

సాగు విస్తీర్ణం పెరిగింది



ఉద్యాన పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రతి ఏడాది సాగు విస్తీర్ణం పెరుగుతుంది. రైతులు అధికారుల సూచనలు తీసుకుని పెట్టిన పెట్టుబడికి రెండింతలు ఆదాయం వచ్చేలా మంచి దిగుబడులు సాధించవచ్చు. రైతులకు మండల వ్యవసాయాధికారులు, ఉద్యాన శాఖాధికారులు అందుబాటులో ఉంటారు. పంటల సాగులో సొంత నిర్ణయాలు తీసుకోకుండా అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలి.

– మోహన్, ఉద్యానశాఖాధికారి, గురజాల

నేడు అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం



తిరునాళ్లకు ముస్తాబైన అమ్మవారి దేవాలయం

గురజాల: పట్టణంలో వేంచేసియున్న శ్రీ పాతపాటేశ్వరి అమ్మవారి 426వ తిరునాళ్ల మహోత్సవం ఆదివారం జరగనుంది. శనివారం రాత్రి బియ్యం విడుపు కొలత కార్యక్రమం నిర్వహించారు. తిరునాళ్ల మొదటి రోజు బియ్యం కొలత చేపట్టిన బియ్యంను శనివారం రాత్రి విడుపు తీసి కొలవగా బియ్యం రెట్టింపు అవుతాయని భక్తుల నమ్మకం. నేడు తిరునాళ్ళ సందర్భంగా అమ్మవారి దేవాలయం విద్యుత్ వెలుగులతో తీర్చిదిద్దారు. ఆదివారం సాయంత్రం శిడిమాను ఉత్సవం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుటుంది. శిడిమానుకు రైతులు తమ పంట పొలాల్లో పండించిన పంటలను శిడిమానుకు కట్టి గ్రామ వీధుల్లో ఊరేగిస్తారు. దేవదాయ ధర్మదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ముదిగొండ పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేవాలయంలో కొలువైవున్న అమ్మవారిని దర్శించుకునేందుకు సుమారుగా 5 వేల మందికి పైగా భక్తులు వస్తారని, వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకునేందుకు బారికేడ్లు ఏర్పాటుతో పాటు తగు చర్యలు చేపట్టారు. దేవాలయ కమిటీ చైర్మన్ కనకం ఆదినారాయణ దత్తు ఆధ్వర్యంలో ఏర్పాట్లును పర్యవేక్షిస్తున్నారు.

మాలధారులకు సద్ది వితరణ



అయప్పస్వామి మండపంలో హోమాల్లో పాల్గొన్న మాలధారులు

రెంటచింతల: వివిధ స్వామి మాలధారులకు సద్ది వితరణ చేస్తే ఎంతో పుణ్యఫలమని స్థానిక శివాలయం చైర్మన్, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పల్లెర్ల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం స్థానిక శివాలయం ఆవరణలోని అయ్యప్ప సేవాసమితి మండపంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెర్ల సత్య వెంకటరామిరెడ్డి(రాంబాబు), పాత పాలువాయి గ్రామానికి చెందిన స్వాములతో కలిసి 28వ రోజు స్వాములకు ఏర్పాటు చేసిన సద్ది కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మంచి మనస్సుతో ముందుకు వచ్చి దీక్ష తీసుకున్న మాలధారులకు సద్ది ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమన్నారు. వేదపండితుడు జిగురు చంద్రశేఖర్ నేతృత్వంలో భక్తిశ్రద్ధలతో హోమాలు, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెన్నా వెంకటేశ్వరెడ్డి, కట్టెబోయిన సైదులు, గురుస్వామి కట్టమూరి శ్రీను, గుండా రాము, బరువు శివారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జర్నలిస్టులపై దాడులు చేసినవారిని కఠినంగా శిక్షించాలి

- సాక్షి విలేకరులపై దాడులకు నిరసన



తహసీల్దార్ దానియేలుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రెస్ క్లబ్ నాయకులు

పెదకూరపాడు: విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని పెదకూరపాడు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కడప జిల్లా పులివెందులలో సాక్షి విలేకరులపై దాడులకు నిరసనగా శనివారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ మీసాలు దానియేలును కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులను నివారించేందుకు కఠినచట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. దాడులు చేసిన వారిని ఇంతవరకు అరెస్టులు చేయకపోవడం బాధాకరమన్నారు. దాడులు నివారించకపోతే భవిష్యత్తులో జర్నలిజానికి పెను ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రజా సమస్యలను పాలకులు దృష్టికి తీసుకువచ్చే విలేకరులను దాడులు చేసి గాయపరచడం సరికాదని తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ నాయకులు పరగటి రాజు, పర్చూరు పూర్ణచంద్రరావు, అనిల్ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గం

19న సత్తెనపల్లిలో నిరసన ప్రదర్శన



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న చలమయ్య

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గమని, స్మార్ట్ మీటర్లు పెట్టడం అక్రమమని సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు గద్దె చలమయ్య అన్నారు. శనివారం పట్టణంలోని పుతుంబాక భవన్‌లో విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల సమస్యలపై అన్ని రాజకీయ పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సీపీఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల అధ్యక్షత వహించారు. స్మార్ట్ మీటర్ల ప్రమాదాలను పలువురు చర్చించారు. ఈ నెల 19న సత్తెనపల్లిలో జరిగే నిరసన ప్రదర్శనలో పెద్ద ఎత్తున ప్రజానీకం పాల్గొని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు రాజ్‌కుమార్, పెండ్యాల మహేష్, డీపీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి నందిగం చిట్టిబాబు, సీపీఐ నాయకులు ఇర్మియా, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆశోక్, సీపీఎం నాయకులు గుంటుపల్లి బాలకృష్ణ, పొట్టి సూర్యప్రకాశరావు, పతంగి ప్రభాకర్, షేక్ సైదులు, గుంటుపల్లి రజిని, గద్దె ఉమాశ్రీ, షేక్ సైదులు పాల్గొన్నారు.

ఘనంగా కాశీనాయన ఆరాధన మహోత్సవాలు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులోని కాశీనాయన ఆశ్రమంలో అన్నదాన ప్రభువైన శ్రీశ్రీశ్రీ కాశీనాయన 29వ ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మార్గశిర శుద్ధ చతుర్దశి పౌర్ణమి గడియలలో జ్యోతి ప్రజ్వలన అత్యంత వైభవంగా చేశారు. కాశీనాయనకు ప్రత్యేక పూజలు నిర్వహించి సత్సంగం పారాయణం, భజన నిర్వహించారు. నిత్య అన్నదానంలో 24 గంటల పాటు 108 వంటకాలతో వేలమందికి అన్నసంతర్పణ గావించారు.

డయల్ యువర్ డీఎంకు ఒక వినతి

నరసరావుపేట: డయల్‌యువర్ డీఎం కార్యక్రమానికి ఒక ఫోన్‌కాల్ వచ్చినట్లు డిపో మేనేజర్ జీఎస్ఎస్ కుమార్ వెల్లడించారు. సత్తెనపల్లి నుంచి అనీల్ ఫోన్‌చేసి నరసరావుపేట నుంచి చెన్నైకు బస్ సర్వీసు నిర్వహించాలని కోరారన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో ఒత్తిడి లేని విద్య



నాదెండ్ల: ఒత్తిడి లేని నాణ్యమైన విద్యకు కేంద్రియ విద్యాలయం చిరునామా అని పల్నాడు జిల్లా రెవెన్యూ అధికారి, విద్యాలయం నామినీ చైర్మన్ ఏకా మురళి చెప్పారు. ఇర్లపాడు విద్యాలయంలో శనివారం 62వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎండీ ఫరూక్ పాఠశాల యొక్క వార్షిక నివేదికను వినిపించారు. అనంతరం పాఠశాలలో ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు పి.శేషగిరిరావు, సాంబశివరావులను సత్కరించారు. డీఆర్వో మురళీ మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ 400 మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలకు రూ.38 కోట్లతో నిర్మించిన నూతన భవనాల్లో విద్యార్థులకు సౌకర్యవంతమైన వాతావరణంలో మెరుగైన విద్య అందిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్నందున జిల్లాలో ఉన్న విద్యాలయాలతో పోటీపడి పాఠశాలకు విద్యార్థుల తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. సుమారు రూ.3 కోట్లతో స్టాఫ్ నివసించేందుకు క్వార్టర్స్ కూడా నిర్మించారన్నారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మాజీ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

‘మాల మహానాడు’ సెమీ క్రిస్మస్ వేడుకలు



సత్తెనపల్లి(ముప్పాళ్ళ): నియోజకవర్గ మాల మహానాడు కమిటీ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మృత్యుంజయరావు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో డాక్టర్ ఆంద్రూస్ పాలపర్తి పాల్గొని క్రీస్తు సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మాల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పెదపూడి విజయ్‌కుమార్, జిల్లా డీఆర్ఓ ఏకా మురళి, జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోదా జాన్‌పాల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 300 మంది వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ దయానందం క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, సత్తెనపల్లి ఏఎంసీ చైర్మన్ పెండెం బాబురావు, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ చుక్కా చంద్రపాల్, నాయకులు జ్ఞానరాజ్‌పాల్, మాలే పద్మారావు, ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు మాలె మరియదాసు, యన మాల సింగయ్య, మాతంగి సుధాకర్, మాలే కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మీడియా స్వేచ్ఛను హరించడం అన్యాయం

అచ్చంపేట: వైఎస్సార్ జిల్లా, పులివెందుల నియోజకవర్గంలోని వేములలో సాగునీటి సంఘ ఎన్నికలపై మీడియా కవరేజ్‌కు వెళ్లిన సాక్షి బృందంపై దాడి చేసి గాయపరచడం దారుణమని, ఇది ముమ్మాటికి మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపసారు. ప్రజాస్వామ్యానికి నాల్గవ స్తంభంగా పిలువబడే మీడియాకే రక్షణ లేనప్పుడు ప్రజాస్వామ్యం ఎక్కుడుందని ఆయన ప్రశ్నించారు. దోషులు ఎంతటి వారైనా తక్షణమే అరెస్ట్ చేసి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని ఆయన కోరారు.

విద్య ద్వారానే అత్యున్నత స్థాయి

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): సమాజంలో విద్య ద్వారానే అత్యున్నత స్థాయికి చేరగలమని అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఒ.జాన్సన్ పేర్కొన్నారు. సత్తెనపల్లిలోని అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో కార్ప్స్ సంస్థ బాల బాట ఆర్గ నైజర్ల సమావేశం శనివారం జరిగింది. సమావేశానికి సంస్థ డీడీ జి.సుబ్బారావు అధ్యక్షత వహించారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

రెంటచింతల పీహెచ్‌సీలో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ



రోగులకు అందిస్తున్న సేవల వివరాలను అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ రవి

రెంటచింతల: వివిధ రకాల వ్యాధులతో వచ్చే ప్రజలకు వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా ఆరోగ్యశాఖ అధికారి రవి అన్నారు. స్థానిక పీహెచ్‌సీ కేంద్రాన్ని ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించి ల్యాబ్‌లో ప్రజలకు నిర్వహిస్తున్న పరీక్షలను తెలుసుకుని రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం జ్వరాల సీజన్ కాబట్టి ల్యాబ్ టెక్నీషియన్లు ఖచ్చితంగా నిత్యం ఆస్పత్రిలో అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. మెడికల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బందికి తగు సలహాలు, సూచనలను ఎప్పటికప్పుడు అందిస్తూ ఉండాలన్నారు. ప్రస్తుతం పీహెచ్‌సీ పరిధిలో వస్తున్న జ్వరం కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు పీహెచ్‌సీకి వచ్చే రోగుల వివరాల(ఓపీ) నమోదు, ఆస్పత్రిలో రోగులకు ఆరోగ్య, ఆశా కార్యకర్తలు అందిస్తున్న సేవలు, రక్తపరీక్షల వివరాలు, మందులు ఇచ్చే విభాగం పనితీరు, వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరం రెంటచింతల–3 సచివాలయంలో నిర్వహిస్తున్న వ్యాక్సిన్ పాయింట్‌ను సందర్శించి అక్కడ రికార్డులు పరిశీలించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డాక్టర్ హనుమంతురావు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు ప్రదీప్ కుమార్‌రెడ్డి, రమాదేవి, సూపర్ వైజర్లు ఎన్.కోటేశ్వరరావు, హెచ్‌వీ లక్ష్మీప్రసన్న, హెల్త్ అసిస్టెంట్ మహేష్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల కమిటీ ఎన్నికలు



దాచేపల్లి అధ్యక్షుడిగా ఎన్నికైన భాస్కర్‌రావుకు నియామకపత్రం అందజేస్తున్న ఆర్వో పాపకుమారి

దాచేపల్లి: సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం జరిగాయి. తంగెడ, రామాపురం మేజర్ కాలువ పరిధిలో జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలను దాచేపల్లి, కేసానుపల్లి, ముత్యాలంపాడు, రామాపురం, తంగెడ, పెదగార్లపాడు గ్రామాల్లో అధికారులు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోటీలో నిలిచిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలాలు చేశారు. రిటర్నింగ్ అధికారులు నామినేషన్ పత్రాలు పరిశీలన చేసి పోటీలో నిలిచిన అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. సాగునీటి సంఘాల కమిటీలకు పోటీ లేకపోవటంతో ఎన్నిక లాంఛనంగా జరిగింది. మేజర్ కాలువ పరిధిలోని 43 టీసీ అధ్యక్షుడిగా పెదగార్లపాడుకి చెందిన ఇమ్మిడిశెట్టి చిన్న బ్రహ్మయ్య 45వ టీసీ అధ్యక్షుడిగా తక్కెళ్లపాడుకి చెందిన బండి శ్రీనివాసరావు, 46వ టీసీ అధ్యక్షుడిగా కేసానుపల్లికి చెందిన కర్నాటి నరేంద్ర, 47వ టీసీ అధ్యక్షుడిగా దాచేపల్లికి చెందిన పగడాల భాస్కర్‌రావు, 48వ టీసీ అధ్యక్షుడిగా మాదినపాడుకి చెందిన పాతకమూరి ఫణీంద్ర. 49వ టీసీ అధ్యక్షుడిగా తంగెడకి చెందిన యంపరాల హస్సన్, 50టీసీ అధ్యక్షుడిగా పిన్నెల్లికి చెందిన చింతపల్లి గౌస్, 52వ టీసీ అధ్యక్షుడిగా ముత్యాలంపాడుకి చెందిన పాశం చిన్న వెంకరెడ్డి. 25టీసీ అధ్యక్షుడిగా గామాలపాడుకి చెందిన బండి కాంతారావు 26 టీసీ అధ్యక్షుడిగా రామాపురంకి చెందిన ఆకూరి వెంకటరెడ్డి, 60టీసీ అధ్యక్షుడిగా దాచేపల్లికి చెందిన శోఠెం నాగేశ్వరరావు, 59వ టీసీ అధ్యక్షుడిగా కాట్రపాడుకి చెందిన చిన్నంరాజు కృష్ణంరాజులను సభ్యులు ఎన్నుకున్నారు. ఎన్నికైన అధ్యక్షులకు ఎన్నికల అధికారులు నియమక పత్రాలు అందజేశారు. జలవనలరుశాఖ ఏఈ పసుపులేటి ఆదినారాయణ, ఏఈడి. పాపకుమారి తదితరులు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. తహసీల్దార్ వైవీ కుటుంబరావు ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు.

మాచర్లలో...

మాచర్ల రూరల్: మాచర్ల మండలంలోని ఐదు గ్రామాలలో నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగినట్లు తహసీల్దార్ బత్తుల వాణి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ నాయక్‌లు తెలిపారు. మండలంలోని తాళ్ళపల్లి గ్రామ మాదిపాడు చెరువు చైర్మన్‌గా కొప్పుల మల్లయ్య ముదిరాజ్, వైస్ చైర్మన్‌గా పండ్ల సైదులు, కొత్తపల్లి: అల్లం కొండారెడ్డి, గొల్లమూడి శ్రీనివాసరెడ్డి, కంభంపాడు 1: కూరాకుల గోవిందయ్య, పోర్ల ఉషమ్మ, కంభంపాడు2: కోకా జయరామ్, దొండేటి మల్లారెడ్డి, మాచర్ల బ్రహ్మానాయుడు చెరువు నీటి సంఘం: ముక్కా సోమయ్య, ఈర్ల జానయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

వెల్దుర్తిలో...

వెల్దుర్తి: మండలంలోని నాలుగు గ్రామాలలో నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగినట్లు తహసీల్దార్ షేక్ బాషా, ఎంపీడీఓ ప్రసాద్‌లు తెలిపారు. మండలంలోని వజ్రాలపాడు గ్రామ చెరువు చైర్మన్‌గా దేశావత్ లక్ష్మీబాయి, వైస్ చైర్మన్‌గా దేశావత్ కృష్ణా నాయక్, గంగిరెడ్డిపల్లె: జవిశెట్టి కోటయ్య, జూలకంటి ప్రమీల, గుడిపాడు: మండ్లి ఈదమ్మ, ముడావత్ చిన బాలాజీనాయక్, పట్లవీడు: గీదా వెంకాయమ్మ, బత్తుల నాగరాజులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వారు తెలిపారు.

రెంటచింతలలో...

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో శనివారం నిర్వహించిన 6 సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి వై. శివనాగేశ్వరరావు తెలిపారు. గొట్టిముక్కల మేజర్‌కు అధ్యక్షుడిగా తుమ్మా ఏలీషా జోజిరెడ్డి, గొట్టిముక్కల మేజర్(11): సింహాద్రి బాపూజీ, మల్లవరం: వెంపటి హనుమంతురావు, పాలువాయి: బెల్లంకొండ శ్రీనివాసరావు, మల్లవరం మేజర్(3): పోట్ల నరసింహారావు, రెంటచింతల: మద్దిగపు పిచ్చిరెడ్డిలు ఎన్నికైనట్లు తెలిపారు. షేక్ వలి, చల్లా గోవిందురెడ్డి, గోళ్ల మల్లయ్య, గాలి వెంకటేష్, కొంగర నాగేశ్వరరావు, దాసినేని అమరబాబులను ఉపాధ్యక్షులుగా 12 మంది టీసీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. గొట్టిముక్కల మేజర్ (6) టీసీకి ఒక్కరు కూడా నామినేషన్ దాఖలు చేయలేదని ఆయన తెలిపారు.

బైక్ చోరీల కేసులో నిందితుడి అరెస్టు



స్వాధీనం చేసుకున్న బైక్‌లు, డీఎస్పీ అబ్దుల్ అజీజ్, ఎస్‌హెచ్‌ఓ వీరయ్య తదితరులు

పట్నంబజారు: బైక్ చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలో గుంటగ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎం.వీరయ్య వివరాలు వెల్లడించారు. ఇటీవల గుంటూరు నగరంలో బైక్ చోరీలు అవుతున్న నేపథ్యంలో ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పక్కా సమాచారంతో ఉమెన్స్ కాలేజీ రోడ్డులో పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం, లెనిన్‌నగర్‌కు చెందిన పెరికల సాగర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా, చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు. గుంటూరు నగరంలో కొత్తపేట, లాలాపేట, పాతగుంటూరు, ఖమ్మం, ప్రాంతాల్లో చోరి చేసిన 11 ద్విచక్ర వాహనాలతోపాటు, మూడు ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 11 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఎస్ఐలు రమేష్, తరంగిణి, సిబ్బంది ఆంథోని, కోటేశ్వరరావు, అనిల్ తదితరులను అభినందించారు.

కుట్టు మిషన్లు పంపిణీ



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న బ్యాంక్ మేనేజర్, సంస్థ ప్రతినిధులు

రాజుపాలెం: స్త్రీలు చేతి వృత్తుల ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటూ అభివృద్ధి చెందవచ్చని యూనియన్ బ్యాంక్ మేనేజర్ పి.సైలేష్ భరత్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పథ సేవా సంస్థ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్, పథ సేవా సంస్థ సంయుక్తంగా మహిళలకు సబ్సిడీపై కుట్ట మిషన్లు శనివారం పంపిణీ చేశారు. ముందుగా 60 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అందులో 30 మందికి కుట్టు మిషన్‌లను సబ్సిడీపై అందించారు. ఈ కార్యక్రమంలో పథ సేవా సంస్థ డోనర్ ముగ్రే స్మైకాల్, కోఆర్డినేటర్ టి.యోహాన్‌రాజు, పుష్పా సంస్థ బోర్డు మెంబర్ గుమ్మడి శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.